




ఆరోజు మామ్మూలికన్న కొంచెం పెందలాడే ఇంటికివచ్చింది మాలచ్చిమి. గుమ్మానికి అడ్డంకట్టిన తడిక తోసుకొని లోపలికివెళ్తూ, "ఎంకటేసు ఏడకి పోనాడో?" అనుకొంది, రోజూ తన కోసం గుమ్మంలో ఎదురుచూసే కొడుకు ఆ చుట్టుపక్కల కనిపించకపోవడంతో.

ఎంకటేసు ఎక్కడికీపోలేదు, గుడిశెలో ఒక పక్కగా మంచంమీద మూడంకెలా ముడుచుకొని పడి నిద్రపోతున్నాడు.

"బొట్టిడీయేలప్పుడు తొంగున్నాడేటి?" వేళకాని వేళ కొడుకు అలా మంచానపడి నిద్రపోవడంతో మాలచ్చిమి మనసు కలతపడింది. చేతిలో ఉన్న సామాన్లని కిందపెట్టి, ఆత్రంగా కొడుకు నుదురుముట్టుకొని చూసింది. ఎంకటేసు శరీరం నులివెచ్చగా చేతికి తగిలింది. ఆ చేత్తోనే తన ఒళ్ళు తాకి చూసుకొని తనదీ అలాగే ఉండడంతో, కొడుకు ఊరకే నిద్రకి జోగేడు కాని మరేం చికాకులేదని నిర్ధారించుకొంది. దండెంమీద పడిఉన్న చీరెని తీసి, రెండు మడతలుపెట్టి కొడుకు మెడదాకాకప్పి, నేచేడంటే బువ్వని గోలెడ్తాడు. బేగి పొయ్యి కింద మంటేసి కూడొండాలి." అనుకొంటూ ముందుకి నడిచింది.

చలికాలం ఇంకా బాగా రాకపోయినా శీతగాలి తిరిగింది. వేడివేడి ఉడుకునీళ్ళు ఒంటిమీద పోసుకొంటుంటే ఉదయం నుంచి పడ్డశ్రమ మరపుకి వచ్చింది మాలచ్చిమికి. ఆరోజు ఎంకన్నగారి డాబాయింటికి కాంక్రీటుస్లాబు వేసేరు, కాళ్ళు విరిగేలా పరుగులుపెట్టి పని చేసింది. పని పూర్తయి గమేలాలు నేల పడేసి నిలబడబోయేసరికి కాళ్ళలో శక్తి సన్నగిల్లినట్లు లొటలొటలాడేయి కాళ్ళు. బజారుదాకా ఎలాగో లేని ఓపిక తెచ్చుకొని నడిచి కాస్త టీనీళ్ళు గొంతుకలో పోసుకొన్నాక ఆ ప్రాణం కుదుటపడింది. ఉదయం పనిలోనికి పోతూంటే ఎంకటేసు మరీమరీ సెప్పేడు 'నాను పైడమ్మత్తింట బుద్ధిగా ఉంటకానీ మాపిటికి రొయ్యలపులుసెట్టాలి మరి' అంటూ. ఆవేళ శనివారం, కూలి డబ్బులు చేతిలోపడ్డాయి. బియ్యం, ఎండురొయ్యలు ఇంకాపులుసుకి కావలసిన ఉప్పూ, చింతపండూ వగైరా సామానులన్నీ కొనుక్కొని ఇంటిముఖం పట్టింది మాలచ్చిమి.

పక్కనున్న పాతకోక మొలకు చుట్టుకొని, పొయ్యిమీద కూటికుండలో ఎసరెట్టి బియ్యం కడిగి పోసింది. బియ్యం ఉడుకకందుకొనేలోగా చమురుపిడతలో చెయ్యిముంచి తలకి రాసుకొని, నున్నగా దువ్వి, జెడల్లి ముడిచుట్టింది. మూడేళ్ళ నాడు నూకాలమ్మ పండక్కి కన్నోరెట్టిన ఉల్లిరంగు గళ్ళచీర కర్రపెట్టె లోంచి తీసి కట్టుకొంది. ఉల్లిరంగు కోక కట్టి, నల్లరంగు రవికె తొడిగి ఆరోజు




మాలచ్చిమి తీర్థంలో తిరుగుతూంటే అంతమంది జనంలో ఆ పిల్లని గుచ్చి గుచ్చి చూడనివాళ్ళే లేరు. "బలే పసందు గుంది గుంట, మీవూరి సరుకేనేటి?" అని అడిగి వివరాలు తెలుసుకోని వయస్సువాళ్ళు లేరు.

మాలచ్చిమికి తానందంగా ఉంటానని తెలుసు. చక్కగా ముస్తాబయితే ఇంకా అందంగా ఉంటుందనీ ఆరోజే తెలుసుకొంది. పెణకనున్న అద్దంతీసి బొట్టూ కాటిక పెట్టుకొంటుంటే, పొద్దుటేల పైడమ్మొదినిచ్చిన నరసింహస్వామి పెసాదం గుర్తుకొచ్చింది. ఒక చిన్న కొబ్బరిముక్క, ఒక మందారపువ్వు. కొబ్బరిముక్క కొడుకుకోసం దాచిపెట్టి, మందారపువ్వు అందంగా ముడిపై అమర్చుకొంది. ముస్తాబంతా సరిగా ఉందోలేదో అద్దంలో మరొక్కమారు చూసుకొని అద్దాన్ని తిరిగి పెణకలోపెట్టి పొయ్యిముందుకి వచ్చింది.

ఉడికిన అన్నంలో గెంజి గుబులు గుబులుగా పడుచుపిల్లమనసులో కోరికల్లా ఎగిరిపడ్తున్నాది. గెంజి వార్చి కూటికుండని పక్కగా పొయిసెగలో ఉంచి, పులుసుదాకలో రొయ్యిల తాలింపు పెట్టింది. కమ్మటి తాలింపువాసన ఒక్కసారి గుడిశెంతా గుబాళించింది. పొయ్యికిందమంట దిగలాగి పొంగుతున్న పులుసును తెడ్డుతో కలుపుతుంటే గుమ్మానికి అడ్డంకట్టిన తడిక తోసిన చప్పుడు అయింది. అప్పటికే కనుచీకటి పడింది. పక్కగా ఉన్న బుడ్డి అందుకొని పొయ్యిలోని మండుతున్న పుల్ల తీసి దీపం వెలిగిస్తూ "ఏరది" అంది, మాలచ్చిమి వెనుతిరిగి చూడకుండానే.

"నాను" అన్నాడు ఆ వచ్చిన వ్యక్తి మెల్లగా.

"నానంటే?" బుడ్డిలో వత్తిని పైకి ఎగదోస్తూ మళ్ళా అడిగింది మాలచ్చిమి.

"నానూ...సింవాద్రిని" అన్నాడు ఆ వ్యక్తి.

మాలచ్చిమి చేతిలో దీపం ఇటుఅటు కదిలింది. దాన్ని నెమ్మదిగా పక్కనున్న దిమ్మపై ఉంచి, గుమ్మంవైపు తిరుగుతూ "ఏంటిలా వచ్చినావు?" అంది ఏభావం ధ్వనించని కంఠంతో.

"ఏటిలే" నసుగుతూ అన్నాడు సింవాద్రి.

"ఏటీ నేకపోతే మూడేళ్ళ పొద్దయి వొప్పుడూ రానోడివి ఈయేల ఎందుకొచ్చినట్టు?" ఈసారి సింవాద్రి కళ్ళలోకి సూటిగా చూస్తూ ప్రశ్నించింది మాలచ్చిమి.

"వత్తునోళ్ళంతా ఎందుకొత్తన్నారు?" అదోలా నవ్వుతూన్నాడు సింవాద్రి.

ఒక్కసారి సింవాద్రి వైపు చురుగ్గా చూసింది మాలచ్చిమి. మళ్లీ అంతలోనే సర్దుకొని "ఆళ్లంతా నీతీ జాతీ లేనోల్లు. నీకూ ఆళ్లకీ సాటేమిటి? మీయమ్మ సెప్పిందిగందా నువ్వు రాములోరంత పవిత్రుడివీ - అరిచ్చెందురుడంత సత్తెమంతుడివీ—అని" ఉక్రోషంగా అంది మాలచ్చిమి.

సింవాద్రి మాట్లాడలేదు. పక్కగా ఉన్న చెక్కపెట్టిమీద చోటుచేసుకొని కూర్చునే ప్రయత్నంలో ఉన్నాడు.

"సిట్టెమ్మ పుట్టింది కెల్లినాదేటి?" కవ్విస్తున్నట్లు చూస్తూ ప్రశ్నించింది మాలచ్చిమి.

"ఆ ముండ ఊసు ఎత్తకేస్" చిరాగ్గా అన్నాడు సింవాద్రి.

"నువు దుక్కనాగుండగా అది ముండెట్ట అవుతాది?"

"అవకపోతే సావనీ" పైమీదిగుడ్డ గట్టిగా గాలిలోకి దులిపి మళ్ళా భుజం మీద వేసుకున్నాడు.

"కావాలని యంటపడి తిరిగి మరీ పెళ్ళిసేసుకొన్నావుగందా దానబ్బడబ్బుకి కళ్ల బెమసి-అప్పుడే మొగంమొత్తేసినాదేంటి?" దానికి సింవాద్రి జవాబు చెప్పలేదు. "కూడులోకి ఏటొండుతున్నవో కాని మాకమ్మగ వాసనొస్తంది" అన్నాడు ముక్కుపుటాలు ఎగరేస్తూ.

"ఎండురొయ్యలపులుసు."

"మావసందుగ ఎట్టేదానివి. అటొంటిది తిని ఎంతకాలమయ్యిందో?"

"నీ కింకయన్నీ గుర్తున్నాయేమిటి?"

"ఏది మరసిపోనా మరిసిపోవచ్చు గాని తిన్నతిండి మరిసిపోతే మల్లా జల్మలో తిండి బుట్టదంటారు-అది



సరేగాని, నాకూ్కంత కూడెడతావేటి? మద్దెనాల పట్టంలో ఆ ఓటలు మెతుకులు సప్పెడిపత్తెంలా నోటికిపోనేదు."

"పట్టంలో ఏపారం ఎట్టేవుట?"

"ఏరు సెప్పేరేటి?"

"ఏరో ఓరు. నిబద్ధి అయినమాట ఏరు సెప్తేనేటి. బలేగా సాగుతోందట ఏపారం. ముందల సరుగుడు దుంగలు- ఎనక సారాబుడ్లు......

"అదంతా నాదేటి...మామావది."

"మీ మావదైతే నీదికాదేటి? దాని కోసమే గంద నమ్ముకున్నదాని బతుకుల బుగ్గోసి ఆగుంటవెంటపడ్డది. ఏరికి తెలియని యవ్వారం!"

సింవాద్రికి సంభాషణ సాగుతున్న తీరు నచ్చలేదు. ఆ విషయం అతడి ముఖమే చెప్తున్నాది. ఇంతకాలమయేక ఈరోజు మాలచ్చిమితో వాదులాడడానికి రాలేదు. వాడు సరదాగా కాస్త సమయం గడుపుదామని వచ్చేడు. వచ్చింద మొదలుగా మాలచ్చిమి పుల్లవిరుపుమాటలే మొదలుపెట్టింది. మాట మారుద్దామనే ప్రయత్నంలో ఇటు అటు చూసి "ఎంకటేసు ఈ ఏలప్పుడు తొంగున్నాడేటి? ఒళ్లు సుకంగుందా!" అన్నాడు, లేచివెళ్ళి ఆ పిల్లడి నుదురు ముట్టుకుచూస్తూ. "ఈ ఏల ఆడంటే అభిమానం పుట్టుకొచ్చిందేటి?" మాలచ్చిమి తన మార్గం వదలలేదు.

"ఈ ఏలన్నమాటేటి. ఎప్పుడూ ఉంటాది.రగతంలో రగతమా మరోటా? పొమ్మంటే పోతాడేటి?"

"ఆడు నీ కొడుకే కాదన్నావు... ఆడిలో నీ రగతం లేనేలేదన్నావు. అప్పుడు లేంది వుప్పుడు కొత్తగా పుట్టుకొచ్చిందేటి?"

"ఏదో గాచారం అట్టాసేసింది- అయన్నీ మరసిపోయే మాలచ్చిమి" బతిమాలుతున్నట్లు అన్నాడు సింవాద్రి.

"గాచారవంట గాచారం...సెయ్యాలని బుద్దెట్టిసేసి మల్లా మరసిపోయే అంటే...మరసిపోక నిన్నట్టుకు ఏలాడేనేటి?"

"అట్ట కోపంతో మాటాడుతోంటేనువు బలే పసందుగుండవు." ముచ్చటగా నవ్వేడు సింవాద్రి.

"పెల్లాంకాని పెతి ఆడదీ మొగోడికి పసందుగే ఉంటుంది."



"మల్లి మనం పెల్లిసేసుకొందా వేంటి?" కులాసాగా నవ్వుతూ అన్నాడు సింహాద్రి.

"నీకు సిగ్గులేకపోతే నాకు ఉండ దనుకొన్నావేటి? పెద్దమనుసులముందు అన్నిమాటలు సెప్పి..."

"మల్లా ఆ పెద్దమడుసుల్నే పెళ్లి సేసేపుందాం..తీరిపోతుందియవ్వారం."

"అంటే ఒగ్గేసి పల్లక కూకోడానికి నీ పెల్లాం ఈ మాలచ్చిమి కాదు. సింత బరికెట్టుకొని ఎంటపడ్తాది సిట్టెమ్మ."

ఆ మాటంటుంటే మాలచ్చిమికి మూడేళ్ళనాటి సంగతి గుర్తుకొచ్చింది. మాలచ్చిమికి సింహాద్రికి పెళ్ళిఅయి అప్పటికి నాలుగేళ్ళయింది. దంపతు లిద్దరూ చిలకా గోరెంకల్లా ఉండేవారు. ఎంకటేసు కడుపున పడ్డమే చెడ్డ గడియలోపడ్డాడు డబ్బు రీత్యా చూసు కొంటే అది మంచిగడియే. అప్పటి వరకు ఆ పల్లెటూర్లో చిన్నా పెద్దాపనులు చేసుకొంటూ బ్రతుకుతున్న వడ్రంగి సింహాద్రికి పట్నంలో పెద్దపని దొరి కింది. గురునాధం అనే కంట్రాక్టరు పెద్ద మేడకడుతూ వడ్రంగిపనికి సింహాద్రిని పిలుచుకుపోయేడు. పది రోజులు పట్నంలో, పది గంటలు ఇంట్లో ఉన్నట్లు గడిచిపోయింది ఏడాదిపాటు.

ఎంకటేసు పుట్టేక ఓసారి నెలరోజు లైనా సింహాద్రి పట్నంనుంచి తిరిగి రాలేదు. మాలచ్చిమి వీళ్ళనీ వాళ్ళనీ కబుర్లుపెట్టగా ఒకనాడు ఇంటికివచ్చేడు. అంతకాలం తరువాత వచ్చిన భర్త పదో పరకో డబ్బుతెచ్చి చేతిలో పెడ్తాడనీ, అభిమానంగా తననీ, కొడుకునీ చేర దీస్తాడనీ ఆశతో ఎదురొచ్చింది మాలచ్చిమి.

సింహాద్రి మాలచ్చిమిని పలకరించ నైనా పలకరించకుండా చేతిలో బట్టల సంచిని ఇంట్లోపడేసి, గిర్రున తిరిగి వెళ్ళిపోయేడు. ఆ వెళ్ళినవాడు తిన్నగా గూడెం పెద్దలముందుకిపోయి "నాను మాలచ్చిమిని ఒగ్గేత్తున్నాను...పంచా యతి ఎట్టించండి" అన్నాడు. సింహాద్రి నోటినుంచి పూర్తిగా ఆ మాట బయట పడకముందే మాలచ్చిమి చెవులకి చేరి పోయింది వార్త. ఇటీవల సింహాద్రి వరసచూస్తుంటే ఇటువంటిదేదో జరుగు తుందని ఆమె అనుకొంటూనే ఉంది. అందుకే ఆ వార్తవిని హడలిపోలేదు. గోడుగోడున ఏడవలేదు. తల్లిని వెంట బెట్టుకొని, కొడుకుని చంకనెత్తుకొని పెద్దలముందుకి వచ్చింది.

మాలచ్చిమిని విడిచిపెట్టడానికి సింహాద్రి చెప్పిన కారణాలు ఏమంత పెద్దవి కావు. పోయినసారి మాకాలమ్మ పండుగలో చిలకలా సింగారించుకొని, వయ్యారాలు ఒలకపోస్తూ, కనిపించిన వారందరితో నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడిందట. తను వద్దన్నా వినకుండా చినబావ కోటేసు పక్కని కూర్చుని రంగులరాట్నం తిరిగిందట. "నేను పక్కనుండగనే ఇన్ని ఏసాలు పోయిన మడిసి నాను ఊరలేనప్పుడు ఇంకెంత నాటకమాడిందో నాకేం ఎరుక? మడిసి బుద్ధి ఓపాలి సెడకనేపోవాలి కాని సెడిందంటే ఇంక బెమ్మదేవుడు కూడా సక్కబెట్టనేడు" అన్నాడు సింహాద్రి.

"ఆడు అన్నమాటలన్నీ ఇన్నావు కద మాలచ్చిమీ, నువ్వేటంటావు?" అని అడిగేరు పెద్దలలో ఒకరు.

"నానేటి అనను బాబూ? ఆడికేటి. అనే మాటుంటే ఇంతకు ముంగలే మీ ముందుకి వచ్చేదాన్ని, నాయంసెప్పమని. ఆరునెల్ల పొద్దుయి ఆడు పట్నంలో ఏటి సేసేడు. ఎవరితో తిరిగేడో - సేతుల్లో పడ్డసొమ్ము ఏరికి మింగపెడ్తన్నాడో... ఇయన్నీ నాను సెవులతో ఇన్నానే కాని కల్లతో సూడనేదు బాబూ! కల్లతో సూడందే ఆడు మంచోడుకాడని మీ ముంగల నాయానికొత్తే నా ముకాన మీలాటోల్లంతా ఏ మాటలు అంటారో..

ఏ బుద్ధులు నెప్తారో... అయే ఆడికి నెప్పండి...మనసున్న మడిసైతే ఇను కొంటాడు. నేక మనువే నెడగొట్టు కోవాలనుకుంటే...ఆడన్నట్టు ఆ బెమ్మ దేవుడు కూడా నిలపనేడు" అంది నిదా నంగా మాలచ్చిమి.

మాలచ్చిమి అన్న మాటలు సబబుగా ఉన్నాయన్నారు పెద్దలు. కేవలం అను మానంమీద భార్యాభర్తలు విడిపోవా లనుకోవటం, ఇటువంటి చిన్న చిన్న విషయాలకి నలుగురి మధ్యకివచ్చి అల్లరిపడ్డం మంచిది కాదన్నారు. అయి పోయిందేదో అయిపోయింది. ఇకనుంచి ఇద్దరూ బుద్ధిగా ఉండి సంసారం చేసు కోండి అని హితవు చెప్పేరు.

పెద్దల మాటలకి సింవాద్రి ముఖం విడలేదు. ఈ బుద్ధులు వినడానికా మీ ముందుకి వచ్చింది అన్నట్లు చూసేడు. అతడిని తృప్తిపరచడానికి పెద్దల్లో ఒకరు కలుగజేసుకొని,'మొదటితప్పు'గా మాలచ్చిమిని మన్నిస్తున్నారనీ, ఇక ముందు మర్యాదగా మసలుకొంటానని పెద్దలముందు సింవాద్రికి మాటిచ్చి కుల తప్పుగా ముప్ఫయి రూపాయలు కట్టా లనీ అన్నాడు.

కూతురి కాపురం ఏ గంగలో కలిసి పోతుందో అని కంగారుపడ్తున్న మా లచ్చిమి తల్లి పోలమ్మ సంతోషించి సమ్మతించబోయేసరికి, "నువ్వుండే" అంటూ మాలచ్చిమి తల్లికి అడ్డు తగిలింది.

"తవరు పెద్దలు. తవరు సెప్పేమాట కాదనే దాన్నికాను. ఈ చనంనుంచి ఆడి మనసుకి నచ్చినట్టే నడుసుకొంటాను. ఆడు కూకోమంటే కూకుంటాను, తొంగోమంటే తొంగుంటాను. అలాగని నా బొట్టిడిమీద ఒట్టేసిసెప్తాను... మరి, ఆడినీ సెప్పమనండి. తాలికట్టిన దానిని ఉసురెట్టా పట్టంలో అడ్డమైన ఓళ్ళంటా తిరిగి తమాసాలు సెయ్యనని బొట్టిడి తలమీద సెయ్యేసి సెప్పమనండి."




"ఆడుమొగోడు... ఆడూ నువ్వూ ఒకటే నేటి" మందిలోంచి ఎవరో అన్నారు.

"ఆడు మొగోడు-నాను ఆడదానిని. కాదన్ను. కాని, నీతీ, నాయం అంటూ ఉంటే అందరికీ ఒక్కనాగే ఉండా లంటాను. సుట్టపక్కాలతో నవ్వుతూ ఊసులాడినందుకు నాను ముప్ఫయి రూపాయలు కులతప్పు ఉచ్చుకోవాలంటే ఉచ్చుకొంటాను. మరి ఆడుసేసిన పన్లుకి ఆడ్నీ ఉచ్చుకోమనండి ఏబైయ్యో అరవయ్యో ... తవరెంత నాయం అని తలుత్తే అంత" అంది మా లచ్చిమి ధైర్యంగా.

అప్పటివరకు నెమ్మదిగా సాగుతున్న వాదవివాదాలు మాలచ్చిమి మాటలతో కళ పెళలాడేయి. సింవాద్రి బలగమంత మాలచ్చిమిని తిట్టిపోసేరు. ఊళ్ళో మగాళ్ళు సగానికిపైగా సింవాద్రినే బల పరచేరు. చివరకి తల్లి పోలమ్మకూడా మాలచ్చిమినే మందలించింది. "సిన్న గుంట. దాని మాటలకేటి బాబూ! పంట సేతిలో పడగానే నా నిచ్చుకొంటాను ముప్ఫయి రూపాయలు" అంది.

అప్పటికే సింవాద్రి కోపం తార స్తాయికి లేచింది.

"ఆ సొమ్మొట్టి ఇంకో మనువు నేసు కొనేదాకా నీ బొట్టిడికి గెంజిపొయ్యి. ఆ నెడిపోయిన ముండముకం సూసినా పాపం సుట్టుకొంటుంది. ఈ చనంనుంచీ దానికీ నాకూ సరి" అన్నాడు ఉక్రోషంగా.


"రుజువూ సాచ్చంలేనపుడు అలాంటి మాటలనకూడదురా సింవాద్రీ! పాడై పోతవు" అంది మాలచ్చిమి మేనత్త.

"ఇంకా రుజువూ, సాచ్చం కావాలేటి. ఆ గుంటడి మొకం సూత్తే తెలియడం నేదా! దాని పాపాలకి ఆడే సాచ్చికం."

అప్పటివరకు కళ్ళుమూసుకొని వేప చెట్టు మొదట్లో కూచుని వారందరి మాటలు కిమ్మనకుండా వింటున్న మాలచ్చిమి ఒక్కసారిభద్రకాళిలా కళ్ళు తెరచి, పూనకంవచ్చిన దానిలా ఊగి పోతూ "ఏటీ?" అంది.

"ఆ ఎర్రజుట్టునన్నాని ఎదవనేడూ. అన్నీ ఆడి...''

సింవాద్రి మాట పూర్తికాకుండానే "ఛీ...తూ" అని కాండ్రించి వారిముందు ఉమ్మేసి "ఎంతమాటన్నావురా సచ్చి నోడా! నిన్ను ఆ బగవంతుడు కూడా సెమించడు" అని గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది మాలచ్చిమి.



మాలచ్చిమితో వ్యవహారం తెగ తెంపులు చేసుకొన్న నెలతిరక్కుండా సింవాద్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. మాలచ్చిమి మాత్రం మారు మనువుకు పోలేదు. రెండేళ్ళపాటు రెక్కలు ముక్కలు అయేలా ఈ ఇంట ఆ ఇంట పనులుచేసి, నీతిగా బ్రతుకుతూ పిల్లడిని పెంచుకొచ్చింది. ఎంకచేసుకి మూడో ఏడు వచ్చేసరికి పోలమ్మ చచ్చిపోయింది. మాలచ్చిమికి మిగిలిఉన్న ఆ కాస్త సహాయం కూడా లేకుండా పోయింది.

ఒంటరిగా వయసులో ఉన్న పిల్ల, అందునా నీతిలేనిదని మొగుడు వదలి పెట్టిన ఆడది — అయినవారికీ కాని వారికీ అందరికీ అలుసే. అయినవి కానివి పుట్టించి వీధీవాడా ప్రచారం చెయ్యసాగేరు. ఇదిగో తోక అంచే అదిగో పులి అనే మన సత్వంగల మనుషులు ఆ పిల్ల దరిదాపులకి రావడమే ప్రమాదం అన్నట్లు తమ పనుల్లోంచి తప్పించేసేరు. తినిందికి తిండిలేక, ఉండిందికి నీడలేక తల్లీ బిడ్డా ఎండు టాకుల్లా మలమల మాడిపోయేరు. కష్టాలు ఒంటిగారావు అన్నట్లు ఎంకచేసుకి జబ్బుచేసింది. జబ్బుతో పడున్న కొడుక్కి మందులేక నోట్లో పొయ్యడానికి గుక్కెడు జావలేక కట కట లాడింది ఆ తల్లి ప్రాణం.

అన్ని విధాలా ఆ పిల్ల ఇరుకునపడ్డ సమయంలో అప్పుడు రంగంమీదికి దిగ పడ్డారు కొందరు పెద్దలు. చాటుగా మాటుగావచ్చి పలకరించి, యోగక్షేమం అడిగి, పదీ పరకా చేతిలో పెట్టేరు కొందరు పెద్దలు. తనకోసం కాకున్నా తన కొడుకుకోసమన్నా తను బతకాలి. ఈ ప్రపంచంలో ఒంటరి ఆడది బ్రతక డానికి ఇదే మార్గం అయితే ఇలాగే బ్రతుకుతుంది తను. అందువల్ల ఆ భగవంతుడు పాపమే రాస్తే అది తనొక్కతే భరించదు. తనతోపాటు ఈ ఊరు ఊరంతా పంచుకొంటారు. అన్న నిర్ణయానికి వచ్చింది మాలచ్చిమి.

పెద్దలచలవవల్ల కూడుకి, గుడ్డకిలోటు లేకుండా వెళ్ళిపోసాగింది మాలచ్చిమి జీవితం. పనిలోకిపోతే పూర్వంలా దులపరించుకోకుండా పనులిచ్చేవారు ఊరివాళ్ళు. "ఒడ్డునున్నోళ్ళని నీట్లోకి నాగేదాకే అందరికీ సందడి. ఆయెనక ఆళ్ళు మునిగినా తేలినా యారికిపట్టదు" అనుకొనేది మాలచ్చిమి ఊరివాళ్ళ మాటలువింటూ.

మాలచ్చిమి తన ఆలోచనల్లో ఉండగా వీధి గడపలో అలికిడిఅయింది. తడికె తీసుకొని సింవాద్రి బైటికివెళ్ళి మళ్ళా రెండు నిముషాల్లోనే తిరిగి వచ్చేడు.

"ఎవరేటి?" అంది మాలచ్చిమి సింవాద్రిని చూస్తూ.

"చాకలి ఈరిగాడు. పెద్ద బుగత కబురంపినాట్ట."

"ఏటిసెప్పేవు?" కుతూహలంగా అడిగింది.

"నాబం లేదు. బుక్కాయిపోనాది అన్నాను."

చిన్నగా నవ్వింది మాలచ్చిమి. ఆ నవ్వులోని అర్థం సింవాద్రి గ్రహించ గలిగిఉంటే తిరిగి ఆమె ముఖంవంక చూడగలిగి ఉండేవాడు కాడు. కాని సింవాద్రిలో మగాడు అది గ్రహించే స్థితిలోలేడు. అందుకే ఆరాత్రి ఆమెతో గడపగలిగేడు. ఆ వెనుక క్రమంతప్పకుండా వారం వారం మాలచ్చిమికోసం రాగలిగేడు.

ఒకసారి వారం మధ్యలో వచ్చేడు సింవాద్రి. అలికిడి విని తడిక తీసుకొని బైటికివచ్చింది మాలచ్చిమి. గడపలో నిలబడిన సింవాద్రినిచూసి "ఈయే లొచ్చేవేం?" అంది. "నీ మీద మనసు పుటి" అన్నాడు సింవాద్రి చిన్నగా నవ్వుతూ. "లోపలెవరేటి?" అన్నాడు మెల్లిగా.

మాలచ్చిమి మాట్లాడలేదు.

"బేగి పంపేసిరా. ఈడనేకూకుంట" పైమీదగుడ్డ దులిపి అరుగుపై పరుచుకొంటూ అన్నాడు సింవాద్రి.

ఒక్కక్షణం సింవాద్రివైపు జాలిగా చూసి లోపలికి వెళ్ళిపోయింది మాలచ్చిమి.

———